క్లుప్తంగా

రేపటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

రాజంపేట టౌన్ : టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆ ఆలయ కమిటీ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు ఉప్పు రామచంద్ర, పట్టెం శంకరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు ప్రతి రోజు సాయంత్రం 6:30 గంటల నుంచి ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ రామాయణం, మహాభారతం, భగవద్గీతల గురించి ఉపన్యాసం చేస్తారని తెలిపారు. 12వ తేదీ శుక్రవారం మహిళలచే కుంకుమార్చన, 13వ తేదీ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాలను ప్రజలు జయప్రదం చేయాలని వారు కోరారు.

యోగాలో ఉచిత శిక్షణ

రాజంపేట టౌన్ : పట్టణంలోని మున్సిపల్ పార్కులో ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 6:30 గంటల వరకు యోగాలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు యోగా మాస్టర్ టి.రెడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల దృష్ట్యా ప్రజలు, విద్యార్థుల కోసం యోగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా వల్ల దీర్ఘకాలిక వ్యాధులు దూరం కాగలవన్నారు. అందువల్ల ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9441012816 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా గంగమ్మకు పొంగుబాలు


పూజా కార్యక్రమంలో కొల్లం గంగిరెడ్డి, బాబుల్‌రెడ్డిలు

రైల్వేకోడూరు : మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలోని కాపుపల్లెలో ఆదివారం గంగమ్మకు గ్రామస్తులు ఘనంగా పొంగుబాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డిలు హాజరై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, శివారెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లూరమ్మకు పూజలు

చిన్నమండెం : మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

శివాలయానికి రూ. 5 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : బొమ్మవరం గ్రామంలో స్వయంబుగా వెలసిన శ్రీ పార్వతీ పరమేశ్వరి దేవాలయానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 5 లక్షల విరాళాన్ని ముక్కా రూపానందరెడ్డి గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ–1 గౌరీ శంకర్ రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్ రెడ్డి, సర్పంచ్‌లు లౌడి గంగురాజు, అరవ శ్రీధర్, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తులు రమేష్, చెంగల్ రాజు, కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గుట్టపల్లె అంజన్న జాతర


జాతరలో భక్తుల సందడి

సంబేపల్లె : గుట్టపల్లె గ్రామంలో వెలిసిన వీరాంజనేయస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. ఆలయ చైర్మన్ చిదంబర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతరను ఘనంగా జరిపారు. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీబండ్లు కట్టి, ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్ : శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై మిస్బా మూవీ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వేసవి సెలవులు కావడంతో రద్దీ కనిపించింది. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బలహీనవర్గాలకు ప్రభుత్వం పెద్దపీట

– గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


పథకాల గురించి వివరిస్తున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో ఆయన గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాసాపేట గొల్లపల్లె, రాజీవ్ స్వగృహ కాలనీలో ఉదయం 6 గంటలకే ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి వివరిస్తూ, సమస్యలపై ఆరాతీస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు. రూ.7 కోట్ల నిధులతో రాజీవ్ స్వగృహలో అభివృద్ధి పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు.

ఆదర్శ కాలనీగా రాజీవ్ స్వగృహ

రాజీవ్ స్వగృహను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామని ఎంఎల్‌ఏ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా రాజీవ్ స్వగృహలో తిరుగుతున్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు ఇంటింటా ఆత్మీయ స్వాగతం పలికారు. తాగునీరు, పారిశుధ్యం పనులు, రహదారి మరమ్మతులపై శ్రీకాంత్‌రెడ్డి కాలనీవాసులతో చర్చించారు. రాజీవ్‌స్వగృహలో అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చూపిస్తున్న చొరవ అభినందనీయమంటూ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మూతపడిన దశలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేకదృష్టితో కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారంటూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్ జ్యోత్స్న, స్థానిక నేతలు నేలపాటి వెంకటేష్, ఆంజనేయులు, వైఎస్ఆర్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, జీఎండీ ఇమ్రాన్, జీఎండీ ఇర్షాద్, సుగవాసి ఈశ్వర్, ఆసిఫ్‌అలీఖాన్, కొలిమి చాన్‌బాషా, గౌస్‌ఖాన్, జానం రవీంద్ర, అన్నా సలీం, కో–ఆప్షన్ సభ్యుడు అయ్యవారురెడ్డి, హజరత్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలకు జీతం పెంచేలా చూడండి

వైద్యారోగ్యశాఖలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు జీతం పెంచేలా చూడాలని ఉద్యోగులు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి విన్నవించారు. ఆదివారం వారు పట్టణంలో శ్రీకాంత్‌రెడ్డిని కలుసుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ సీహెచ్‌ఓలు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌లో గత 4 ఏళ్లుగా పని చేస్తూ గ్రామీణులకు వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న అన్ని స్థాయిల అధికారులకు జీతాలను పెంచి తమకు మాత్రం పెంచలేదన్నారు.

గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి ఏడాది 5 శాతం జీతం పెంచాల్సి ఉందన్నారు. తమరైనా జోక్యం చేసుకుని తమకు జీతం పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటూ ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానంటూ చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా సభ్యులు మోహన్, అహమ్మద్‌బాషా, శ్వేత, కనకమ్మతోపాటు పలువురు పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని దర్జిపల్లె గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు దర్జీపల్లె సుబ్బారెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్నరాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదివారం సుబ్బారెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ గడ్డం జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు మనోహర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా ఠాగూర్ జయంతి

వాల్మీకిపురం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఠాగూర్, అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండాలి


జయభరత్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి

సిద్దవటం : బద్వేల్ డివిజనల్ పరిధిలోని సిద్దవటం, గోపవరం, అట్లూరు, మండలాల్లోని ఉద్యాన రైతులు మోచా తుఫాన్ వల్ల అకాల వర్షం పడినప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మామిడి, చీని, నిమ్మ పంటలను సాగు చేసిన ఉద్యాన రైతులు మోచా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మామిడి కోత దశలో ఉన్నందున ఎక్కువగా గాలుల నుంచి పంటలను కాపాడుకోవాలన్నారు. పక్వానికి వచ్చిన కాయలను త్వరితగతిన కోయాలన్నారు. అలాగే పక్వానికి 10నుంచి 15 రోజులు ఉన్న చెట్లపైన పొటాషియం నైట్రేట్10 గ్రాములు, బోరాక్స్ 1.5 గ్రాముల మందును లీటరు నీటికి పిచికారి చేయాలన్నారు. ఉద్యాన రైతులు రైతు భరోసా కేంద్ర సిబ్బంది ద్వారా ఉద్యాన అధికారుల సూచనలను తప్పకుండా పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చునన్నారు. వర్షం తరువాత రోజు ఎండగా ఉన్నప్పుడు కాయ దశల్లో ఉన్న తోటల్లో బావిస్టన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేసి కాయను తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలియజేశారు.

వైభవంగా కొత్తపురమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో కొత్తపురమ్మ


సిద్దల నైవేద్యం సమర్పిస్తున్న దృశ్యం

సంబేపల్లె : దుద్యాల గ్రామ దేవతగా కొలువైన కొత్తపురమ్మ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిద్దల నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

మంగంపేటలో ఇంటింటికి బియ్యం పంపిణీ


మంగంపేటలో బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట పంచాయతీలో రెండు సంవత్సరాల నుంచి పలు కారణాల వల్ల ఇంటింటికి వాహనంలో బియ్యం పంపిణీ నిలిచిపోయింది. అయితే ఇటీవలే మా నమ్మకం నువ్వే జనన్న కార్యక్రమంలో సమస్యను గ్రామస్తులు గుంతకల్లు రైల్వేబోర్డు సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డికి సమస్యను తెలియజేశారు. సమస్యను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో తల్లెం భరత్ కుమార్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూశారు. బియ్యం పంపిణీ వాహనాన్ని మరమ్మతులు చేయించి ఆదివారం నుంచి గ్రామంలో ఇంటింటికి బియ్యాన్ని పంపిణీ చేశారు. సమస్య పరిష్కరించడంతో గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

37 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


రాయచోటి టౌన్ : రాయచోటి లయన్స్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచితంగా 37 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం వివిధ మండలాలల నుంచి సుమారు 60 మందికి కంటి పరీక్షల నిర్వహించారు. వారిలో 37 మందికి ఆపరేషన్ల కోసం రెఫర్ చేసి ఉచితంగా ఆపరేషన్లు చేశారు. అలాగే గత వారం ఉచితంగా ఆపరేషన్లు చేయించుకున్న 35 మందికి కళ్ల అద్దాలను అందజేశారు. కంటి ఆస్పత్రి చైర్మన్ వై.వి.స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరెడ్డి, డాక్టర్లు సురేష్ బాబు, భార్గవి, మహాలక్ష్మి, మాలీ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా


సమస్యలు తెలుసుకుంటున్న శంకర్‌నాయక్

పుల్లంపేట : మండల పరిధిలోని బావికాడపల్లి ఎస్టీ కాలనీకి సంబంధించిన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వారికి అన్నివిధాల న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన ఎస్టీ కాలనీని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, వసతి గృహాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు మంజూరు చేయించాలని గ్రామస్తులు శంకర్ నాయక్‌ను కోరారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దండు గోపి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒస్కోటమ్మ తిరునాల


ప్రత్యేక అలంకరణలో ఒస్కోటమ్మ

గుర్రంకొండ: మండలంలోని సంగసముద్రం గ్రామ దేవత ఒస్కోటమ్మ తల్లి తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలో మహిళలు అమ్మవారికి బోనాలు, దివిటీలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మేళతాళాలతో, బాణాసంచా పేల్చుతూ పెద్ద ఎత్తున చాందినీబండ్లు తరలివచ్చాయి. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణాతో వచ్చిన చాందినీ బండ్లు అందర్నీ ఆకట్టుకొన్నాయి. తిరునాల సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్తులు అమ్మవారి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు.

వైభవంగా మండెం నారసింహుడి కల్యాణం


చిన్నమండెం: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


పెనగలూరు: పురవీధులలో గ్రామోత్సవం అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులు

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి కల్యాణాన్ని వేదపండితులు జరిపారు. సర్పంచ్ తిమ్మారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరగ్గా, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమణ, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండెం లక్ష్మీనృసింహస్వామికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. మొలకల పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న మండెం లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా వారు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజాది కార్యక్రమాలు జరిపి తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. రూ.1.50 కోట్ల నిధులతో త్వరలో చేపట్టనున్న ఆలయ నిర్మాణ అభివృద్ధి పనులపై వారు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, రెడ్డన్న, ఎంపీటీసీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయశంకర్‌రెడ్డి, శేషారెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, రామచంద్ర, సిద్దయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

పెనగలూరు : ఈటమాపురం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి తూర్పుపల్లెలో గ్రామోత్సవం జరిపారు. పంచాయతీలోని ఈటమాపురం, నాయుడువారిపల్లి, తూర్పుపల్లె గ్రామాలలో ఒక్కో రోజు ఒక్కో గ్రామం వంతున ఈనెల 10వ తేదీ వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తూర్పుపల్లెలో అన్ని కులాల వారు కలిపి లక్ష్మీన రసింహస్వామి ఊరేగింపును బాణసంచా పేల్చుతూ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని అన్ని కులాలవారు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

10న పుష్పయాగం

బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ తేదీన పుష్పయాగం చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్దగుండాల్ రెడ్డిలు తెలిపారు. అలాగే మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఘనంగా పాలేరమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో పాలేరమ్మ

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లె గ్రామ సమీపంలో వెలసిన పాలేరమ్మ జాతర శుక్ర, శని, ఆదివారాలలో మూడు రోజులపాటు నిర్వహించినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారన్నారు. అమ్మవారికి మొక్కుబడి ఉన్న వారు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడి చెల్లించుకున్నారని పేర్కొన్నారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి హరికథలు, భజనలు ఘనంగా నిర్వహించారు.

నేడు జాన్ హెన్రీ డ్యూనాంట్ జయంతి

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని సోమవారం కడపలోని మట్టిపెద్దపులి వీధివద్దగల రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ మెడికల్ ఆఫీసర్ డా.తేజ తెలిపారు. ఉదయం 9.00 గంటలకు కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

రాజగుంటలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దాతలు

చిట్వేలి : రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలుపుతున్న దాతలు ఇతరులకు ఎంతో స్ఫూర్తిదాయకులని రాజగుంట సర్పంచ్ గుత్తి నరసింహ, ఎంపీటీసీ నానబాల నాగార్జునలు అన్నారు. ఆదివారం రాజగుంట గ్రామంలో మెగా రక్తదాన శిబిరాన్ని డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి వారు ప్రారంభించారు. 137 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మారుమూల గ్రామంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి రక్తదాతలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. మండలంలో 458 మంది దాతలు ఉండటం గర్వకారణమని నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థ సంచాలకులు మధు అభినందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, సీహెచ్ ఎస్ సంస్థ కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్, లోకేష్, రమణ, శివారెడ్డి, నాగేశ్వర నాయుడు, ఉపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ పాలన కోసం జగనన్నను ఆశీర్వదించండి


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి

కేవీపల్లె : రాష్ట్రంలో సువర్ణ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మారేళ్లలో ×మా నమ్మకం నీవే జగన్, జగనన్నే మా భవిష్యత్తు¥ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా ఆశిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థికంగా ప్రయోజనం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పొత్తపు సతీష్‌రెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి, రామకొండారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం



సిద్దవటం: సమ్మర్ క్యాంపునకు సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమవుతుందని మండల గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆమె మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, గణితం, పెయింటింగ్, బొమ్మలు తయారు చేయుట, పుస్తకాలపై సమీక్ష, పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ సమ్మర్ క్యాంపునకు పాఠశాల విద్యార్థులు 10 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పాల్గొనాలని తెలియజేశారు. సమ్మర్ క్యాంపు 40 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. శిబిరానికి ఆయా రంగాల్లో ప్రావీణ్యం ఉన్న వారితో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. అంతే గాకుండా శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఈ క్యాంపునకు పంపించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : గ్రంథాలయం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నేటి నుంచి 11 తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ నిర్వాహకుడు రెడ్డిశేఖర్ ఆదివారం తెలిపారు. విజ్ఞాన శిబిరాలలో విద్యార్థులకు గ్రామర్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చదివించడం, ఆటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజ్ఞానానికి దోహదం చేసే గ్రంథాలయ శిబిరాలను తల్లిదండ్రులు పిల్లలను చేర్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 16వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గ్రంథాలయంలో చిన్నపిల్లలకు కథల పుస్తకాలు, విద్యార్థులకు పనికివచ్చే పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రంథాలయంలో విద్యార్థులు వారికి అవసరమైన పుస్తకాలు చదువుకునే అవకాశం కల్పించినట్లు ఆయన తెలియజేశారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు అష్రఫ్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం స్పోకెన్ ఇంగ్లిష్, క్యారం బోర్డు, చెస్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహిస్తామని విద్యార్థిని ,విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరం ముగింపులో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలు అందిస్తామని తెలిపారు.